పేరుకుపోయిన చెత్తాచెదారం

- ప్రత్యేకాధికారుల పాలనలో లోపించిన పారిశుద్ధ్యం
- పట్టించుకోని అధికారులు


రాజులగూడలో పెరిగిన పిచ్చి మొక్కలు

నార్నూర్: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం ఎటువంటి మార్పు కనిపించడం లేదు. ఏ గ్రామంలో చూసినా.. పారిశుద్ధ్యం, క్లోరిరేషన్ లోపం కనిపిస్తోంది. పట్టించుకోవాల్సిన ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు నిధులు లేవనే కారణంగా పారిశుద్ధ్యంపై కన్నెత్తి చూడడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను కూడా తొలగించడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఎన్నికల పనుల్లో బిజీబిజీగా ఉన్నామంటూ తప్పించుకుంటూ.. పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. నార్నూర్ మండలంలో మొత్తం 23, గాదిగూడ మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. డ్రెయినేజీ చెత్తాచెదారంతో నిండిపోతోంది. పూడిక తీయపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. చెత్తాచెదారం నిండిపోయి పల్లెలు అపరిశుభ్రంగా మారినా.. ప్రత్యేకాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం డ్రెయినేజీలు శుభ్రం చేయించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మల్టీపర్పస్ వర్కర్లు ఉన్నా.. పనులు చేసినట్లు వాట్సాప్ గ్రూప్‌లో అధికారులకు ఫొటోలు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు.

పర్యవేక్షణ కరువు..

మండలంలోని ఆయా గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు పట్టించుకోకపోవడంతో పర్యవేక్షణ కరువై గ్రామాలు అధ్వానంగా మారుతున్నాయి. మండలస్థాయి అధికారులు ఉన్నతాధికారుల సమావేశాల పేరుతో కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. గ్రామాలలో కనీసం వీధి బల్బులు కూడా ఏర్పాటు చేయడం లేదు. రాత్రిపూట ఇంటి నుంచి బయటికి వెళ్లాలంటే భయపడుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టిలో పడేందుకు ఏదో ఒక గ్రామాన్ని తనిఖీ చేసినట్లు ఫొటో దిగి వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేసి పని అయిపోయినట్లుగా భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వృద్ధి చెందుతున్న దోమలు



గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. వర్షాకాలం కావడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చేయడం లేదు. స్వచ్ఛత ఎక్కడ కనిపించడం లేదు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేకాధికారులు పర్యటించిన దాఖలు లేవు. ఉన్నారా? లేరా? కూడా తెలియదు.

– పెందుర్ దాదిరావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు

చర్యలు తీసుకున్నాం



గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం, క్లోరినేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. ఎప్పటికప్పుడు ఎంపీవో సాయిప్రసాద్‌తో కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో కలిసి చర్యలు చేపడుతున్నాం. పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటాం.

– గంగాసింగ్, ఎంపీడీవో నార్నూర్

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే

ఆదిలాబాద్: బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లాలోని బేల మండలం మసాలా(కె), దుబ్బగూడ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ హయాంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. కనీసం గ్రామపంచాయతీల్లో బల్బులు పెట్టలేని దుస్థితి ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనతోనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా శ్రమించాలన్నారు. నాయకులు అస్తక్ సుభాష్, పోతరాజు రమేశ్, దినేష్, రాము పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఆదిలాబాద్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల మంజూరు నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జైనథ్ మండలానికి చెందిన పలువురు శనివారం ఎమ్మెల్యేను సన్మానించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో గ్రామాల అభివృద్ధికి ముందుకు సాగుతాయన్నారు. నాయకులు బోయర్ విజయ్, ప్రతాప్ యాదవ్, సత్యనారాయణ సామ సత్యనారాయణ, రాకేశ్‌రెడ్డి, లింగారెడ్డి, పెద్ద లక్ష్మన్న యాదవ్ పాల్గొన్నారు.

మథురతండాల అభివృద్ధికి కృషి

- ఎంపీ గోడం నగేశ్


మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

ఇంద్రవెల్లి: మథురతండాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. శనివారం మండలంలోని జాలంతండా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మథుర సమాజ్ పెద్దలు శాలువాతో సన్మానించారు. చిన్నారులు చేసిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, ధర్మాన్ని కాపాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటిపెల్లి రాజు, కేంద్రే బాలాజీ, రాజలింగు, కనక తుకారం, ఆర్క ఖమ్ము, మారుతి దేవ్‌పూజే, దిలీప్ మోరే, కోవ రాజేశ్వర్, కనక హనుమంత్‌రావ్, హెరేకుమ్ర అనిల్‌కుమార్, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

భీంపూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎంపీ నగేశ్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ నగేశ్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మండలంలోని సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాజు, అంకం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి


పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో

నార్నూర్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఎంఈవో పవార్ అనిత అన్నారు. శనివారం మండలంలోని నాగల్‌కొండ, ఇలాయిజీనగర్, కొత్తపల్లి(హెచ్) గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌తో పాటు పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయులు పోటీతత్వంతో విద్యాబోధన చేయాలని సూచించారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని శాంతినగర్, గంగన్నపేట గ్రామాల్లో బైక్‌పై పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లను, కాలువలను పరిశీలించారు. శాంతినగర్ వాసులతో మాట్లాడుతూ.. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి కాలువలు శుభ్రంగా చేయకపోవడంతో రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లపను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం సరికాదు


మాట్లాడుతున్న చైర్మన్ గంగారెడ్డి

బోథ్: బోథ్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు పక్కాగా ఏర్పడుతుందని, ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేయడం సరికాదని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని చట్ల ఉమేష్ క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఇటీవల బోథ్ మండల కేంద్రంలో జరిగిన సంక్షేమ పథకాల మంజూరు పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బోథ్ రెవెన్యూ డివిజన్ గురించి చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పక్కాగా ప్రజల్లోకి వెళ్తున్నాయన్నారు. రానున్న పదేళ్లు కూడా కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల ఉమేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ఏఎంసీ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, ఆత్మా డైరెక్టర్ గడ్డల నారాయణ, జగన్, కౌసర్, కాయిపల్లి శ్రీనివాస్, ఫెరోజ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్(జి) గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మడావి బాపురావ్ తల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం వారి నివాసానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన ఆడే అశోక్ ఇటీవల క్యాన్సర్ చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఏనుగు కృష్ణారెడ్డిని కాంగ్రెస్ బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ శనివారం పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం కృష్ణారెడ్డి కుమారుడు నర్సింహారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

వర్షానికి కూలిన గోడ

భీంపూర్: మండలంలోని కరంజి (టి) గ్రామానికి చెందిన దేరడ్డి వామన్‌కు ఇంటి గోడ శనివారం ఒక్కసారిగా కూలింది. అకాల వర్షాలకు మట్టి గోడ పూర్తిగా మెత్తబడి కూలినట్లు స్థానికులు తెలిపారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'లంబాడాల ఎస్టీ హోదా రద్దు చేయాలి'


మాట్లాడుతున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: లంబాడాల ఎస్టీ హోదాను వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి రామారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. లంబాడాలు 1970కి ముందు తెలంగాణ ప్రాంతంలో లేరన్నారు. వీరి ఉనికిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలన్నారు. కొందరు లంబాడా నాయకులు సోయం బాపురావు, వెంకట్‌రావులపై పిచ్చి కూతలు కూస్తూ చిచ్చు పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని బేల మండలంలో 90 శాతం లంబాడాలు వలస వచ్చినవారేనని అన్నారు. సమావేశంలో నాయకులు భీంరావు, ఆత్రం ముకుంద్‌రావు, మోమన్, టేకం భీంరావు, అర్క ఉమేశ ఆత్రం భీంరావు, తొడసం ఇంద్రు, మడావి శంబు పాల్గొన్నారు.

'యూరియాపై రాద్ధాంతం చేయొద్దు'


మాట్లాడుతున్న భోజారెడ్డి


కైలాస్‌నగర్: యూరియాపై అవసర రాద్ధాంతం చేయవద్దని, విపక్షాల మాటలను నమ్మి రైతులు ఆందోళన చెందవద్దని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఎలాంటి యూరియా కొరత లేదని, విపక్షాలు ఉద్దేశ్య పూర్వకంగానే రైతులను రెచ్చగొడుతుందన్నారు. తాజాగా తెలంగాణకు 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. కలెక్టరేట్ భవనం కూలిన ఘటనను బీఆర్ఎస్ రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకుంటే బాగుంటుందని హితవు పలికారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తున్నారని, ప్రజలు వాటిని గమనిస్తున్నారని తెలిపారు. సమావేశంలో బాదన్ గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ హాస్టల్‌లో పోలీసుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..

బోథ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన బాలికల హాస్టల్‌లో ముగ్గురు యువకులు చొరబడినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో శనివారం సాక్షి పత్రికలో 'ఆదర్శ పాఠశాలలో చొరబడ్డ ముగ్గురు యువకులు?' శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనానికి అధికారులు స్పందించి పోలీసులు చర్యలు చేపట్టారు. శనివారం, బోథ్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లోని బాలికల హాస్టల్‌లో జరిగిన సంఘటనపై సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీ సాయితో పాటు మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్ విచారణ చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. విద్యార్థినులకు ధైర్యం చెప్పి, కౌన్సెలింగ్ ఇచ్చారు. హాస్టల్‌లోకి ముగ్గురు యువకుల ప్రవేశించారా? లేదా? అన్న దానిపై ఆరా తీశారు. హాస్టల్‌లో కేర్ టేకర్‌గా విధులు నిర్వహిస్తున్న స్వప్నను ప్రశ్నించారు. కేర్‌టేకర్ సేకరించిన రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఫోన్‌లో ఉన్న మెసేజ్‌లు, ఫోటోల ఆధారంగా యువకుల వివరాలు సేకరిస్తున్నారు. డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి సంబంధిత విషయంపై ఆరా తీశారు. శనివారం సాయంత్రం బోథ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. జరిగిన విషయాలను బోథ్ ఎస్సై శ్రీసాయిని అడిగి తెలుసుకున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్

తలమడుగు: మండలంలోని బరంపూర్ కొండపై స్వయంభుగా వెలిసిన కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ తిరుపతిగా ఆధ్యాత్మిక కేంద్రంగా బరంపూర్ ఆలయం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆలయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర రెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, బాపన్న, కమిటీ సభ్యులు బరకం మల్లేష్, ప్రతాప్ పాల్గొన్నారు.

యవకుల రక్తదానం

బోథ్: నిర్మల్ జిల్లా కేంద్రంలో కోణార్క్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సొనాల గ్రామానికి చెందిన డి. గంగాధర్ అనే వ్యక్తికి అత్యవసరంగా రక్తం అవసరమైంది. విషయం తెలిసిన వెంటనే సొనాల గ్రామానికి చెందిన కోస్మెట్ యోగేశ్వర్, కోస్మెట్ సంతోష్, మునిగేలా శ్రీధర్, పడిగెల నాగరాజులు శుక్రవారం అర్ధరాత్రి నిర్మల్ కావేరి బ్లడ్ బ్యాంక్‌కు చేరుకొని రక్తదానం చేసి మానవత్వాన్ని చాటారు.

ఆడె గజేందర్‌ను కలిసిన వంజరి సంఘం సభ్యులు

బోథ్: బోథ్ పట్టణ వంజరి సంఘ సభ్యులు శనివారం నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం, బోరు ఏర్పాటు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.నాయకులు కర్పె శ్రీనివాస్, దొనగిరి రాజు, కరిపే మల్లేష్, దొనగిరి చరణ్, కానుకంటి రమేశ్, నామెడ శేఖర్, వినోద్, రవి, సంతోష్ రాం పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బోథ్: మండలంలోని పలు పాఠశాలల్లో మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్ శనివారం శాలువాతో సత్కరించారు. మండల వ్యాప్తంగా 22 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిని ఘనంగా సత్కరించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం శౌధర్ రెడ్డి, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు తాత్కాలిక మరమ్మతు

బోథ్: ఇటీవల భారీ వర్షాల కారణంగా ధన్నూర్(బి) గ్రామ వంతెన దెబ్బతిన్నది. దీంతో వంతెనపై నుంచి వెళ్లేందుకు గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. బోథ్ పీఏసీఎస్ చైర్మన్ చట్ల ఉమేష్ శనివారం వంతెనపై మొరం వేయించి, మరమ్మతులు చేయించారు. బొడ్డు గంగారెడ్డి, పసుల చంటి, ఇంద్రారెడ్డి, మహమ్మద్ అబ్రార్, గడ్డల నారాయణ, వినయ్ రెడ్డి, అభిరెడ్డి, సంతోష్ పాల్గొన్నారు

సంక్షిప్తం..

స్కూల్ బ్యాగులు పంపిణీ

భీంపూర్: మండలంలోని కరంజి, గుబిడి గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి శనివారం స్కూల్ బాగ్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయులు పాచ్చన్న, జాఖిర్, ఘన్ శ్యామ్, గంగాసాగర్, మహేశ్, సు మన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బోథ్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటో ట్రేడ్ హైదరాబాద్ ఎక్స్‌పో– 2025 పోస్టర్‌ను శనివారం ఎస్సై శ్రీ సాయి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జూకంటి సదాశివ్, బుస లక్ష్మణ్, దండారి రంజిత్, ముప్కాల రాజేశ్వర్, కాడేరుగుల గణేష్ పాల్గొన్నారు.

నేడు ఎల్ఐసీ ఏజెంట్ల కార్యవర్గం ఎన్నిక

కైలాస్‌నగర్: ఎల్ఐసీ ఏజెంట్ల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకోనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మద్దెల చందర్, ప్రధాన కార్యదర్శి ఉష్కం నర్సింగ్, గౌరవ అధ్యక్షుడు మేకల మల్లన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని తానీషా గార్డెన్‌లో ఉదయం 11గంటలకు ఏజెంట్లు అందరూ రావాలని కోరారు.

పేదలకు గొడుగుల పంపిణీ

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి తండ్రి కిష్టారెడ్డి సోమవారం పేదలకు గొడుగులు పంపిణీ చేశారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రజాసేవభవన్‌లో వాటిని అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

నేరడిగొండ: మండలంలోని బుద్ధికొండ తాజా మాజీ సర్పంచ్ ముజ్జిగ గంగామణి స్వామి కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

గుడిహత్నూర్: మండలంలోని తోషం గ్రామానికి చెందిన మహ్మద్ షాబీర్ గేదె విద్యుత్ షాక్‌తో శనివారం మృతి చెందింది. గ్రామంలోని కూడలి వద్ద ఎర్త్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. గేదె విలువ రూ.70వేలు ఉందని, పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు.

యోగా, ధ్యానంతో ఒత్తిడి దూరం

ఆదిలాబాద్‌టౌన్: యోగా, ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని శ్రీరామచంద్ర మిషన్ కో ఆర్డినేటర్ షరీఫ్ అన్నారు. హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో వయోవృద్ధుల సమాఖ్య కార్యాలయంలో శనివారం వయోవృద్ధులకు యోగా, ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్ పాండే, రాముల్కర్, గంగాధర్, శంకర్, హార్ట్ ఫుల్ నెస్ ప్రతినిధులు సునీత, జ్యోతి, శేఖర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ఇచ్చోడ: మండలంలోని గుబ్బ, తండా గ్రామాల్లో శనివారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో ఎస్‌యూవో ఫవార రవీందర్, హెల్త్ అసిస్టెంట్లు రాథోడ్ కైలాస్, రాజ్‌కిరణ్, సూభాష్, వసంత్ పాల్గొన్నారు.

పేకాటాడుతున్న ఆరుగురు అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మావల గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. శుక్రవారం పక్కా సమాచారం రావడంతో దాడి చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి రూ. 1,720 నగదు, నలుగు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మల్లేశ్

ఇచ్చోడ: జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఆరెల్లి మల్లేశ్ నియమకమాయ్యారు. బజార్‌హత్నూర్ మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన మల్లేశ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం సాక్షితో మాట్లాడారు. కలెక్టర్ రాజర్షిషా, మంత్రి జూపల్లి కృష్ణారావులు నాపై నమ్మకం ఉంచి జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులుగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

గుడిహత్నూర్: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, న్యాకో, డీఏపీసీయూ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద కళాజాత బృందం పల్లె సుద్దులు, వీధి నాటకాల ద్వారా ప్రజలకు శనివారం ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ బారిన పడడం కంటే నివారణ ఒకటే మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాగరాజు, డీఆర్పీ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ శశిమాల, లింక్‌వర్కర్ భువనేశ్వరీ, కళాకారులు ప్రేంకుమార్, విలాస్, దత్తు, వెంకటేశ్, పద్మ పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీ ఉన్న సీట్లకు ఈనెల 15, 16 తేదీలలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, దోస్త్ కోఆర్డినేటర్ సరితరాణి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సరిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 94901 39258, 94907 41023 సంప్రదించాలన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఇచ్చోడ: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మధురిమ అన్నారు. శనివారం ఫవార్ రవీందర్‌కు సబ్ యూనిట్ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ.. ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాజుబాయి, అన్నపూర్ణ, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి

భీంపూర్: వర్షాకాలంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని భీంపూర్ మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ సూచించారు. శనివారం మండలంలోని గోన, అంతర్గాం, వామన్నగర్, గోమూత్రి, లక్ష్మీపూర్, బెల్సరీ రాంపూర్ గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో రసాయనాలు పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్య విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృత సమావేశానికి హాజరైన జిల్లా నాయకులు

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగింది. సమావేశానికి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శాంతన్, ఆదిలాబాద్ జిల్లా యూత్ అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్, బద్దం పోతారెడ్డి, నావేద్, శ్రీకర్ గౌడ్ హాజరయ్యారు.

చర్యలు తీసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: నార్నూర్ మండలంలోని కేజీబీవీ పాఠశాలలో రెండు రోజుల క్రితం అన్నంలో పురుగులు వచ్చాయని, వెంటనే సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదిరావు డిమాండ్ చేశారు. శనివారం ఆదివాసీభవన్‌లో మాట్లాడారు. ఆశ్రమాల్లో, కేజీబీవీల్లో నాసిరకం వంటలు పెట్టడంతో విద్యార్థులు అనారోగ్యం బారినపడుతున్నారని అన్నారు. నాయకులు పెందోర్ సంతోష్, పెందోర్ త్రిమూర్తి, మెస్రం మోతిరాం పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

తలమడుగు: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరంగా మారిందని మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన నిమ్మల చినబాయి మూత్రపిండాల వ్యాధితో ఇటీవల సర్జరీ చేసుకోవడంతో ఆమెకు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కు అందించారు. నాయకులు దేవారెడ్డి, కమలాకర్, గణేష్, పూర్ణచంద్ర, తిరుపతి, పోశెట్టి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, రఘువర్ధన్ రెడ్డి, రవి రెడ్డి, గంగన్న, నారాయణ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: భారీవర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎంపీ నగేశ్ కనీసం ఒక్క రైతు పంటచేనును కూడా సందర్శించలేదని విమర్శించారు. యూరియా దొరక్క పంటలను కాపాడుకోలేని దయనీయ పరిస్థితుల్లో రైతులుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు.